# 5

# “నన్ను జ్ఞాపకము చేసికొనుటకు”

సువార్త సందేశానికి క్రీస్తువారి మరణము, సమాధి, మరియు పునరుత్థానాలు ప్రధాన చర్చనీయాంశంగా ఉన్నప్పుడు (1 కొరింథీయులకు 15:3, 4), ఆరాధనలో ప్రభురాత్రి భోజనానికి ప్రధాన స్థానం ఉండవలసిందే. సిలువ విజయమందు, దేవునితోను ఒకరితో ఒకరును పాల్గొనడానికి క్రైస్తవులు మరల మరల ఆహ్వానించబడేది ప్రభువు బల్లయొద్దనే. క్రైస్తవ ఆరాధనలో ప్రభురాత్రి భోజనం కేంద్ర అంశంగా పాత నిబంధన ఆచారాల్లో నిగూఢంగా సూచింపబడింది.

మూడేండ్లుగా, తన నిర్గమముకొరకు ప్రభువైన యేసు తన శిష్యులను సిద్ధపరచుతునే ఉన్నారు. ప్రధానయాజకులచేతను, శాస్త్రులచేతను అనేక హింసలుపొంది, సిలువ వేయబడి మూడవ దినమున లేచుట అగత్యమని కనీసం ముమ్మారైనా ప్రభువు వారికి తెలియజేశారు (మత్తయి 16:21; 17:22, 23; 20:18, 19). చివరిసారిగా ఆయన వారితో భోజనం చేస్తారు. ఆ సందర్భం, వార్షిక పస్కా పండుగ సమయం. ఐగుప్తు దాస్యంనుండి వారి పితరులు విడిపింపబడినది మొదలుకొని హెబ్రీయులు ఈ పండుగనాచరిస్తున్నదే. వారు విడిపింపక ముందటి రాత్రి, ఒక గొర్రెపిల్లను చంపి దాని రక్తము యింటి గడప కమ్ములకు ద్వారబంధములకు పూయవలెనని దేవుడు వారికి ఆజ్ఞాపించాడు. అది విమోచనా రక్తం. ఐగుప్తీయులలోని తొలి చూలుల ప్రాణాలను తీయడానికి దేవుడు వారి యిండ్లలోనికి పోయిననాడు – తమ ద్వారబంధముల మీద రక్తపు గురుతు వేసినవారి యిండ్లను సంహారకుడు దాటిపోయాడు. ఆలాగు సంహారకుడు ఇశ్రాయేలీయుల యిండ్లను దాటిపోయిన దానికి జ్ఞాపకార్థంగా అప్పటినుండి ప్రతి సంవత్సరం పస్కాను ఆచరించవలసిందిగా దేవుడు వారికి ఆజ్ఞాపించాడు (నిర్గమకాండము 12:1–13:10).

ఈ పస్కా భోజనంలో, వధించిన గొర్రెపిల్ల యొక్క కాల్చిన మాంసం, పులియని రొట్టెలు, చేదుకూరలు, ద్రాక్షారసము చేర్చబడియుంటాయి. పిండి పులిసేవరకు వేచియుండకుండ ఆ దేశాన్ని త్వరగా విడిచిపెట్టడానికి సూచనగా పులియని రొట్టెలు గుర్తుచేస్తాయి. చేదుకూరలేమో వారి దాసత్వపు కఠినత్వాన్ని జ్ఞాపకం చేయడానికి. ప్రభువైన యేసు తన శిష్యులతో ఆ జ్ఞాపకార్థపు విందులో పాల్గొనుచుండగా, ఆ పస్కా భోజనంలోనుండి రెండు వస్తువులను తీసికొని, నూతన భావంతో ఆయన వారికిచ్చి యున్నారు. దాని భావం ఆయన శిష్యులకు తరువాత అర్థమయ్యింది.

> వారు భోజనము చేయుచుండగా యేసు ఒక రొట్టె పట్టుకొని, దాని నాశీర్వదించి, విరిచి తన శిష్యులకిచ్చి – “మీరు తీసికొని తినుడి; ఇది నా శరీరమని చెప్పెను.” మరియు ఆయన గిన్నె, పట్టుకొని కృతజ్ఞతాస్తుతులు చెల్లించి వారికిచ్చి – “దీనిలోనిది

మీరందరు త్రాగుడి. ఇది నా రక్తము, అనగా పాపక్షమాపణ నిమిత్తము అనేకులకొరకు చిందింపబడుచున్న నిబంధన రక్తము" (మత్తయి 26:26-28).

మెస్సీయ ప్రసాదించు విడుదలకు సంబంధించిన యాగపు గొర్రెగా ఆయన అయ్యాడు. పాప మరణముల బంధకములనుండి పాప మరణస్థులను విడిపించడానికి ప్రభువైన యేసు తన సొంత శరీరమును, రక్తమును క్రయ ధనముగా యిచ్చారు. సాధారణమైన ఇవి తన బలిని తగినట్టుగా సూచించడానికి ఆయన కోరుకున్నారు. ఐగుప్తు దాస్యంనుండి దేవుడు వారి పితరులను విడిపించిన జ్ఞాపకార్థంగా యూదులు పస్కా ఆచారాన్ని కొనసాగించారు. పాపమునుండి వారి విమోచనను జ్ఞాపకం చేసికొనడానికి క్రైస్తవులు ప్రభువు బల్లచుట్టు కూడతారు.

## రాజుగారికి విందు

శిష్యులు కలిసి భోజనం చేయడానికి యేసు మరణము అంతము కాదు గాని, వారి విందు ఆయనతో ఆరంభమైనది - ఆయన రాజు యొక్క - భోజనపు బల్లయొద్ద వారు భోజనం చేస్తూ ఉంటారు. తరువాత ఆయన చెప్పిందేమో గ్రహించడానికి వారు తంటాలుపడియుండవచ్చు: "నా తండ్రి రాజ్యములో మీతో కూడ నేను ఈ ద్రాక్షారసము క్రొత్తదిగా త్రాగు దినమువరకు, ఇకను దాని త్రాగనని మీతో చెప్పుచున్నాననెను" (మత్తయి 26:29); లేదా, లూకా అన్నట్టుగా, "ఇక మీదట దేవుని రాజ్యము వచ్చువరకు" (లూకా 22:18ఎ) ఆయన మరి ఎన్నడును వారితో పస్కా భోజనాన్ని చేయరు. అయితే, రాజ్యం వచ్చినప్పుడు, వారితో కూడ ఒక నూతన విందును ఆరగిస్తారు. వారి జీవిత కాలాలలోనే ఆ రాజ్యం వస్తుందని ఆయన వాగ్దానం చేశారు (మార్కు 9:1). రాజ్యపు ద్వారాలు తెరిచే హక్కు లేక ఆధిక్యతను ఆయన పేతురు చేతికిచ్చాడు, మరియు ఆయన దాన్ని సంఘమని కూడా పిలిచాడు (మత్తయి 16:18, 19). క్రీస్తువారి పునరుత్థానం తరువాత వచ్చిన తొలి పెంతెకొస్తు దినాన పేతురు రాజ్యపు తాళపుచెవులను ఉపయోగించాడు. అతడు తొలి సువార్త ప్రసంగాన్ని చేశాడు, అది క్రైస్తవ్యానికి తొలిగా మార్చబడేవారుగా పరిణమించింది (ఫలితాన్నిచ్చింది) (అపొస్తలుల కార్యములు 2:14-40). ఇలా మార్పు చెందినవారు పాపక్షమాపణకొరకు యేసుక్రీస్తు నామమున ముంచడం పొందారు (అపొస్తలుల కార్యములు 2:38), మరియు వారు సంఘంతో చేర్చబడ్డారు (అపొస్తలుల కార్యములు 2:47; KJV). సంఘము భూమిమీద దేవుని రాజ్యమైయుంది. ఎక్కడ యిద్దరు ముగ్గురు తన నామమున కూడియుందురో అక్కడ వారిమధ్య తానుంటానని యేసు వాగ్దానం చేశారు (మత్తయి 18:20). "నా తండ్రి రాజ్యములో నేను దానిని క్రొత్తదిగా త్రాగువరకు ..." అని యేసు అన్నారు. తన పునరుత్థానం తరువాత, వారు ప్రభురాత్రి భోజనం చేయడానికి కూడినప్పుడు, ఆయన వారితోనుంటానని వాగ్దానం చేశారు. వారు ఆయన రాజ్యమును, ఆయన తండ్రి రాజ్యమునైయుంటారు.

ప్రభురాత్రి భోజనపు విందు మెస్సీయ రాజుకును, ఆయన ప్రజలకును సరిపోయినదైయుంది. ఈ విందు ఒకరితో ఒకరిని, మరియు వారందరిని తమ రాజుతోను

బంధిస్తుంది. ప్రభువు బల్ల చుట్టు జరిగే ఈ విందు "క్రీస్తు రక్తములో పాలుపుచ్చుకొనుట మరియు క్రీస్తు శరీరములో పాలుపుచ్చుకొనుటయునైయుంది" (1 కొరింథీయులకు 10:16). "రొట్టె యొక్కటే గనుక అనేకులమైన మనము ఒక్క శరీరమైయున్నాము" అని మనం చదువుతాం (1 కొరింథీయులకు 10:17). రాజు యొక్క బలి రక్తముచేత విమోచింపబడినవారు మాత్రమే తన విందులో పాల్గొనడానికి ఆయన సన్నిధిని తగినవారైయుంటారు. వారు ఆ విందులోనికి ఒకే ఒక ఉద్దేశంతో ఆహ్వానించబడ్డారు – పాపం మీద సాధించిన విజయాన్ని ఆయనతోనూ ఒకరితో యింకొకరు పాలుపంచు కొనుటకే.

## ప్రభువు దినపు రాత్రి భోజనం

వారి ఆదికాలపు ఆరంభంనుండి, క్రైస్తవులు వారంలో మొదటి దినాన (ఆదివారమున) రొట్టె విరచుటకు కూడుకునేవారు (అపొస్తలుల కార్యములు 2:42; 20:7). ప్రభురాత్రి భోజనంలో పాలుపొందడానికి "రొట్టె విరుచుట" అనేది బహు తరచుగా వాడే ప్రయోగమైయుంది. 1 కొరింథీయులకు 10:16లో "మనము విరచు రొట్టె" అని పౌలు అన్నప్పుడు, అతడు ప్రభురాత్రి భోజనంలోని ఒక భాగాన్ని సూచిస్తున్నాడు. కొరింథీ సంఘములో దుర్వినియోగం చేయబడుతున్న ప్రభురాత్రి భోజన ఆచరణను పౌలు క్రమపరచజూచి, ప్రభురాత్రి భోజనం చేయడానికి కూడి రావలసినట్టు తేటపరచాడు (1 కొరింథీయులకు 11:20). వారు అక్కడి క్రమాన్ని పాటించనట్టున్నారు, వారు దాన్ని పాటించవలసినవారైయున్నారు. "ఆది సంఘ చరిత్రలో ఈ ఆచరణను ఏకగ్రీవంగా స్థిరపరచుతోంది. ఈ పవిత్ర భోజనాన్ని ఆచరించడానికి వారంలో తొలి దినాన క్రైస్తవులు ఏకంగా కూడి వచ్చే ఆచారాన్ని సవాలు చేసేది అటు లేఖనాల్లోగాని, యిటు ఆది సంఘ చరిత్రలోగాని లేదు."[1]

"భౌతిక సృష్టి జ్ఞాపకార్థంగా యూదులు ఏడవ దినాన్ని ఆచరించారనియు (నిర్గమకాండము 20:8–11); 'నూతన సృష్టి' సాధ్యపరచిన (గలతీయులకు 6:15; నొక్కి చెప్పినది నాది) క్రీస్తు మరణ, సమాధి, పునరుత్థానాలకు జ్ఞాపకార్థంగా క్రైస్తవులు వారంలో మొదటి దినాన్ని (ఆదివారాన్ని) ఆచరించారనియు" డేవిడ్ రోపర్ అన్నాడు (1 కొరింథీయులకు 11:23–25).[2]

## జ్ఞాపకం చేసికొనుట

లూకా వర్ణనలో, జ్ఞాపకార్థపు విందును ప్రభువైన యేసు ప్రారంభించినప్పుడు, "నన్ను జ్ఞాపకము చేసికొనుటకు దీనిని చేయుడి" అని ఆయన తన శిష్యులకు తెలిపారు (లూకా 22:19బి). "నిజంగా ఆయన ఏమి జ్ఞాపకం చేసుకోమని మనలను కోరారు?" అని అడగడం ప్రాముఖ్యమైనది. "ఆయనను జ్ఞాపకం చేసుకోమని కోరుకున్నారు" అని సాధారణంగా చెప్పవచ్చు. అది అల్పమైనది అని నేననుకోవడం లేదు! వారం వెంట వారం ఈ బల్లచుట్టు మనం కూడినప్పుడు ఆయనను గూర్చి మనం ఏమి జ్ఞాపకం

చేసికోవాలి? యథార్థమైన క్రైస్తవుడు సిలువను గూర్చి తలపోసేటప్పుడు, అతని మనస్సు మిళితములైన ఆలోచనలు ఉద్వేగాలచేత పొంగిపొరలుతుంది. అతడు విచారాన్ని, సంతోషాన్ని రెండింటిని అనుభవిస్తాడు. సిలువపై యేసు బలియాగాన్ని తలంచుతుంటే కన్నీరే రావచ్చు. ఆ కన్నీరు అటు సంతోషంవలనగాని, దుఃఖంవలనగాని రావచ్చు. మన విమోచనా క్రయధనం చెల్లించినందున నిశ్చయంగా పశ్చాత్తాపం అనుభవించడానికి నిజమైన కారణం లేకుండాపోలేదు; ప్రభువైన యేసు ఆ క్రయధనాన్ని చెల్లింపనిష్టపడి నందున ఆనందించడానికి కూడ మంచి కారణం లేకుండపోలేదు. రెండు రకములైన ఉద్వేగాలు తగినవే అయ్యుంటాయి. ప్రభువు బల్లచుట్టు చేరినప్పుడు ప్రతి వారము ఎండిపోయిన కండ్లు లేక కొంత మారిన భావోద్వేగముతో అందరూ కలసి "ప్రభువు వచ్చువరకు ఆయన మరణమును ప్రచురించడం" తగనిదయి ఉంటుంది (1 కొరింథీయులకు 11:26బి).

సిలువలో ముందుగానే ఆయన మనపట్ల ఏమి జరిగించారో దాన్ని జ్ఞాపకం చేసికోమని మాత్రమే మనలను కోరలేదు గాని, నేడు మనకు రాజుగాను, ప్రధాన యాజకుడుగాను, మధ్యవర్తిగాను ఏమి చేస్తున్నారో దాన్ని కూడ జ్ఞాపకం చేసికోవాలని ఆయన కోరినట్టున్నారు (హెబ్రీయులకు 4:15; 1 తిమోతి 2:5, 6). భవిష్యత్తులో ఆయన మనకు ఏమి చేయనైయున్నారు, తన పునరుత్థానంవలన ఏది రుజువుపరచబడిందో దాన్ని సహితం మనం జ్ఞాపకం చేసికొనవలసియుంటుంది: "... మనమాయనతో కూడ చనిపోయినవారమైతే ఆయనతో కూడ బ్రదుకుదుము. సహించినవారమైతే ఆయనతో కూడ ఏలుదుము; ..." (2 తిమోతి 2:11బి, 12).

ప్రభువు బల్లను సమీపించుచుండగా, విచారముగానున్న ఆలోచనా పూరితమైన మనోభావంతో ప్రభువు బల్లను సమీపించడం తగినదే అయ్యుండగా, భోజనం అనగానే ఉత్సవం జరిగించడం గుప్తమైయుంటుంది. మా తండ్రి చనిపోయిన తరువాత, కుటుంబం సెలవులకుగాని, ఆయా కార్యాలకుగాని తిరిగి కలిసికొన్నప్పుడు, మా తండ్రి యికమీదట మాతో ఉండడనే ఎరుక ఎల్లవేళలా బాధాకరంగానే ఉంటుంది. ఆయన జీవించి యున్నప్పుడు జీవితం ఎలా ఉండేదో ప్రత్యేకించి మా తల్లి జ్ఞాపకం చేసికొని విచారించేది. "మీ నాయన దీన్ని ఎంజాయ్ చేసేవారే" అని ఆమె కొన్నిసార్లు అంటుంది. అదే సమయంలో, తాను పిల్లలతో ఉండి ఆయన ప్రసన్నతను ఫీలౌతున్నందుకు సంతోషించేది. ఒక విధంగా ఆయన అక్కడున్నారు, ఎందుకంటె ఆయన మా ప్రతి ఒక్కరిలో ఒక భాగమైయున్నారు. ముగ్గురు పిల్లలు ఆయన పోలికలో ఉంటారు, అంతేకాదు, ఆయన జ్ఞాపకములు మా తల్లి యింకను తన హృదయంలో నిలుపుకొంది.

ఆలాగుననే, ప్రభువైన యేసును జ్ఞాపకం చేసికొనడానికి మనం కూడి వచ్చినప్పుడు, సిలువ కేంద్ర స్థానాన్ని ఆక్రమించుకొంటుంది ఎందుకంటె ఆయన మన పాప రుణమును చెల్లించి మనలను స్వతంత్రులనుగా చేసింది అక్కడే. రొట్టెయు ద్రాక్షారసమును బలియైన ఆయన శరీర రక్తాలను జ్ఞాపకం చేస్తాయి. ఆయన మన బలి పశువు (గొర్రెపిల్ల). ఆయన రొట్టె ద్రాక్షారసములకొరకు కృతజ్ఞతాస్తులు చెల్లించినట్టు కృతజ్ఞతాస్తుతులు చెల్లించడంవలన మనం కలిసి పాలుపంచుకుంటాం. మనం మన విడుదలను

కొనియాడతాం. మనం ఆయనతోను, ఒకరితో ఒకరము, ఒక్క శరీరంలోని సాటి అవయవములుగా మన ఏకత్వాన్ని ఒకరికి ఒకరం సపోర్టుగాను తిరిగి స్థాపిస్తాం. మన మనస్సుల్లో ఆయన ప్రసన్నతను మనం స్పర్శిస్తాం. ఆయన మనలను మృతులలోనుండి లేపుతారని లేదా మన భౌతికమైన దేహాలను మహిమగల ఆయన దేహంతో సమరూపంగా మార్చి నిత్యత్వం ఆయనతో ఉండ కొనిపోయేదానికొరకు వేగిరపడతాం. ఆయన మనం చావకముందే వస్తారో, లేదా చనిపోయాకే వస్తారో ఎలాగైనా ఫరవాలేదు. అది తెలిసికొనడంలో ఆనందముంది. మనం ముందు చనిపోతే, ఆయన మనలను లేపుతారు (యోహాను 5:28, 29; 1 థెస్సలొనీకయులకు 4:16). దానికి ముందుగా ఆయన వస్తే, ఆయన మనలను మార్పు చేస్తారు (1 కొరింథీయులకు 15:52-57).

## భయభక్తితో ఉత్సహించడం

ఉత్సహించడానికి క్రైస్తవులకు ఎంతో ఉంది. క్రీస్తు మన మధ్య ఉండడంతో మనం ఒక శరీరంగా మన ఐక్యతను కొనియాడతాం. మన కుటుంబాన్ని మనం కొనియాడతాం. మనం మన విజయాలను కొనియాడతాం – సిలువచెంత పాపంపై విజయంలో కేవలం మన వంతు పంచుకొనడం మాత్రమే కాదు, అనుదిన జీవితంలో మనం ఆయనతో నడచుటలో వ్యక్తిగత విజయాలను కూడా కొనియాడతాం. పునరుత్థానంలో మన నిరీక్షణను కొనియాడతాం. అది మరణంనుండి మన విమోచనయైయుంది. ఆయన తిరిగి వచ్చే వాగ్దానాన్ని కొనియాడతాం. ప్రభురాత్రి భోజనంలో పాల్గొంటూ మనం సిలువ యొద్దకు తిరిగి రావడంలో, అది చచ్చినవాని గూర్చి దుఃఖం సల్పడం కాదు. యేసు ఎన్నడూ ఆలాటిదాన్ని ఉద్దేశించలేదు. మన విమోచనా మూలాన్ని జ్ఞాపకం చేసికొనడానికి గాను అక్కడికి తరచుగా తిరిగి రావడానికి ఆయన రాత్రి భోజనం మనకు సమయము స్థలమునైయుంది. ఆయన మరణం ఎందుకు అవసరమైయుందో – ఆ విషయాన్ని జ్ఞాపకం చేసికోమని ఆయన మనలను కోరడం మాత్రమే కాదు. పాపం విషయం మన మరణం ఎందుకు అవసరమయ్యిందో కూడ జ్ఞాపకం చేసికోవాలి. ఆయన మరణం సిలువ వద్ద జరిగిందని గుర్తు చేసికొనడం ఎంత ప్రాముఖ్యమో పాపం విషయమై మన మరణము కూడ సిలువ వద్దనే జరిగిందని జ్ఞాపకం చేసికొనడం అంత ప్రాముఖ్యం. "మన ప్రభువైన యేసుక్రీస్తు మూలముగా మనకు జయము అనుగ్రహించుచున్న దేవునికి స్తోత్రము కలుగును గాక" (1 కొరింథీయులకు 15:57).

ఉత్సహించుతాం – కాని దేవుడు పరిశుద్ధుడును, పవిత్రుడును అనియు, మనం పాపులము, బలహీనులమని గుర్తిస్తాం. ఆయన మనవంటివాడు కాదు, కాని ఆయనవలె మనముండాలని ఆయన కోరుతున్నాడు. భయభక్తియు సంతోషమును అభ్యసించడానికి ప్రభురాత్రి భోజనం పరిపూర్ణమైన సెట్టింగ్‌ను ప్రసాదిస్తుంది. మనపట్ల ఆయన అనుభవించిన సిలువ మరణములో పాలుపొంద మనకు అనుమతి అనుగ్రహింపబడిందనే గురుతుగా జ్ఞాపకార్థపు విందును మనం సమీపించాలి. అదే సమయంలో, సిలువకును, సమాధికిని మధ్య ఆయన మనకొరకు సంపాదించిన విజయాన్ని మనం కొనియాడుతాం.

ఈ విధంగా, బల్ల మన ఆరాధనకు కేంద్ర బిందువుగా మారుతుంది. వారంలో మొదటి దినాన మన లేఖన ధ్యానములు, ప్రార్థనలు, పాటలు ఆ పాయింటువైపుకు నడిపింప బడతాయి. అక్కడ, ప్రభువైన యేసు నా కొరకు ఆలాటి వెలను చెల్లించారనే ఆశ్చర్యము, భక్తిపూర్వకమైన భయము, విస్మయము నెమ్మదిగా నేను వ్యక్తపరచగలను. అదే సమయంలో ఆయన అలా చేసిన వాస్తవాన్ని కొనియాడుతాను. ప్రభువు బల్లను నేను సమీపించే ప్రతిసారి, నేనేమైయున్నానో దానినిబట్టి – సిలువలో క్రీస్తు ఏమి చేయవలసి వచ్చిందో దాన్ని గుర్తించడానికి నేను పిలువబడ్డాను. ఆయన ఏమైయున్నారో దానినిబట్టి ఆయన మాత్రమే దాన్ని చేయగలిగారని గుర్తించడానికిని పిలువబడ్డాను. కొన్నిసార్లు నా కన్నులను నింపే కన్నీళ్లు సంతోషము దుఃఖము యొక్క మిశ్రమైయుంటుంది. నేను అనుమతింప బడడం మాత్రమే కాదు, తండ్రిని సమీపించ నేను ఆహ్వానింపబడినందుకు ఆశ్చర్యపోతాను. దానికై, కేవలం నేను ఆయన "నామాన్ని స్తుతించి ఘనపరచడమే" చేయగలను. ప్రభువు బల్ల వద్ద సహవాసము కొనియాడునదైయుంది. అయితే ఆయన మహా ఘనతకు భక్తితో సాగిలపడడం కూడ అయ్యుంటుంది. "దేవుని శీలాన్ని శ్లాఘించి దేవుడు మన ఆరాధనకు పాత్రుడని యిది వ్యక్తపరచుతుంది."[3]

## ముగింపు

ప్రభురాత్రి భోజనం యొక్క శక్తి అక్కడ ఉన్న అద్భుతమైన పదార్థాలలో కాదు, కాని జ్ఞాపకార్థమైన దానిలోనేయుంది. మన దృష్టి క్రీస్తు సిలువమీద కేంద్రీకరించబడే రెండు క్రైస్తవ మూల చిహ్నాలలో రాత్రి భోజనం ఒకటి. రెండవది, బాప్తిస్మం – నీట ముంచబడుట – క్రీస్తుతో మన మరణము, సమాధి, పునరుత్థానాలకు సంబంధించింది. ముందుగానే గతించిపోయిన సంభవంలో పాలుపొందడానికి ఈ చిహ్నాలు మార్గాన్ని యిస్తాయి. జ్ఞాపకార్థమైనదానిలో పాలుపొందడంవలన ఆ సంఘటన సజీవంగా నిలుపబడుతుంది. దీనిని మన సొంత అనుభవంలోనే జరిగించడానికి మనకు అనుమతి నిస్తుంది. బాప్తిస్మము క్రీస్తు మరణ, సమాధి, పునరుత్థానాలలో పాలుపొందడానికి ఒక్కసారి మాత్రమే అవకాశమున్న కార్యం. ప్రభువు బల్ల వద్ద ఆయన మరణం, సమాధి, పునరుత్థానాలలో ప్రతి వారము మనం పాలుపొందవచ్చు. ఆ సంఘటనను సజీవంగాను, మన హృదయాల్లో చురుకుగాను నిలుపుకొనడం ముఖ్యమైయుంటుంది. ఒక కుటుంబంగా మనం కూడడంలో బలం చేకూర్చుకుంటాం. క్రీస్తు బలిని, ఆయన విజయాన్ని ఆయనతో క్రమముగా పంచుకుంటాం.

కుటుంబ సహవాసము ప్రత్యేకమైనది – భౌతికమైన కుటుంబ సహవాసమైనా. ఒకరితో నొకరికున్న నిబంధననుబట్టియు దేవునితో వారికున్న నిబంధనను బట్టియు సంఘము కుటుంబమైయున్నది. తన రక్తము "నిబంధన రక్తమని" ప్రభువు తెలిపారు (మత్తయి 26:28). ప్రత్యేకమైన నిబంధన సంబంధమైన భోజనము ఎక్కువ త్వరితంగా చేస్తుండేది కాదు, లేదా అది త్వరపెట్టబడేది కూడ కాదు. ప్రభురాత్రి భోజనము ఆచార కర్మల నిర్వహణ కాదు. గాని అది మనలను ఏకం చేసే భోజనమైయుంది. అది మన అందరిని ఒక చోటుకు తెచ్చి దేవునితోను ఒకరితో ఒకరిని వర్గ సంబంధం కలిగియుండేలా చేస్తుంది.

అందువలన, మన (ఆది)వారపు ఆరాధన యొక్క సంఘ కూడికలో ప్రార్ధన, స్తుతి ఎంతగా భాగములైయున్నాయో, ప్రభురాత్రి భోజనం కూడ అలాగే భాగమైయుంది. క్రీస్తు మరణము మన ఆరాధనకు కేంద్ర స్థానమైయుండాలి. క్రీస్తు సిలువనొద్దకు మనలను ప్రతి వారము తెచ్చుటకు ప్రభురాత్రి భోజనాన్ని దేవుడు చిత్రించాడు. అక్కడ మన విమోచన సాధ్యం చేయబడింది, మన విజయము ముద్రింపబడింది.

సూచనలు

[1]Jimmy Jividen, *More Than a Feeling: Worship That Pleases God* (Nashville: Gospel Advocate Co., 1999), 105. [2]David Roper, "A Family Portrait," *Truth for Today, Acts 8* (April 1996): 38. [3]Robert E. Webber, *Worship Is a Verb: Eight Principles for Transforming Worship* (Peabody, Mass.: Hendrickson Publishers, 1999), 16.